

బీఎల్‌ఎఫ్ జాబితాను ప్రకటిస్తున్న రాష్ట్ర చైర్మన్ నల్లా సూర్యప్రకాష్, తదితరులు

బీఎల్‌ఎఫ్ ఎంపీ అభ్యర్థుల జాబితా విడుదల

రాంనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్‌ఎఫ్) పోటీ చేసే అయిదు స్థానాల అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించింది. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవనంలో జరిగిన సమావేశంలో బీఎల్‌ఎఫ్ రాష్ట్ర చైర్మన్ నల్లా సూర్యప్రకాష్, ఎం సీపీఐ (యు) ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ తొలి జాబితాను ప్రకటించారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థిగా నూనె వెంకటస్వామి, నల్గొండ అభ్యర్థిగా మస్కుల మట్టయ్య, చేవెళ్ల వనం సుధాకర్, నిజామాబాద్ అబ్బగాని అశోక్‌గౌడ్, జహీరాబాద్ వడ్ల సాయికృష్ణ పేర్లను వారు ప్రకటించారు.

క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

● క్షత్రియ సంఘం నాయకుడు రాంప్రసాద్

రాంనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని శ్రీ క్షత్రీయ, సారోళ్లు, సోమవంశ క్షత్రియుల కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని క్షత్రీయ సంఘం నాయకుడు రాంప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో క్షత్రియ సంఘాల ప్రతినిధులు రాంప్రసాద్, ప్రవీణ్‌కుమార్, జె.వేదకర్‌లు విలేకరులతో మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక, విద్య, రాజకీయ రంగాలలో వెనుకబడి ఉన్న క్షత్రీయ సంక్షేమం కోసం వెయ్యి కోట్ల నిధులతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటిన క్షత్రీయులకు రాజ్యాంగ వాటా రావడం లేదన్నారు. రాష్ట్రంలోని అన్ని కులాలకు కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో క్షత్రీయ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న అశ్వాపురంవేణుమాధవ్

'చాత్తాద శ్రీ వైష్ణవులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

నల్లకుంట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెనుకబడిన, దళిత వర్గాలతో కలిపి 16 సామాజిక వర్గాల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని చాత్తాద శ్రీవైష్ణవ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ అన్నారు. శుక్రవారం నల్లకుంటలోని చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో సంఘం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ చాత్తాద శ్రీ వైష్ణవులను ప్రభుత్వం విస్మరించిందని, సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం తెలంగాణ గౌరవ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తులసి సత్యనారాయణ, బిక్కుమళ్ల నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎమ్మార్పీఎస్ సమావేశం

ముషీరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సాధనకై ఈ నెల 17న సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ 42 డివిజన్ల ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం భోలక్‌పూర్ డివిజన్ ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నారని తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సామియల్, రామకృష్ణ, జాన్‌పాల్, డివిజన్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

"ఎమ్మెల్సీ కవిత అరెస్టు అప్రజాస్వామికం"

ముషీరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ లబ్ధిపొందేందుకే ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారని భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, పార్టీ నగర నాయకుడు శివముదిరాజ్ అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కవిత ఇంటిపై ఈడీ, ఐటీ అధికారులు దాడులు చేయడం, వారెంటు లేకుండా అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. సుప్రీం కోర్టులో కేసు కొనసాగుతుండగానే ఆమెను అరెస్టు చేయడం పద్ధతి కాదన్నారు. సమావేశంలో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ వాణిజ్య కమిటీ అధ్యక్షుడు టెంట్ హౌస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ కమిటీ నియామకానికి నోటిఫికేషన్

చిక్కడపల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ నియామకానికి తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖ వారు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో మాచర్ల దేవనాథం మాట్లాడుతూ నోటిఫికేషన్ విడుదలయిన 10 రోజుల్లోగా ఆసక్తి ఉన్నవారు బొగ్గులకుంటలోని దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో సహాయ కమిషనర్ కార్యాలయంలో తమ దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. నోటిఫికేషన్ ప్రతులను దేవాలయం నోటీసు బోర్డుపై, ముషీరాబాద్ మండల కార్యాలయం, జీహెచ్‌ఎంసీ కార్యాలయం నోటీసు బోర్డులపై అతికించినట్లు తెలిపారు.


ల్యాంప్ లైటింగ్ సెర్మనీలో నర్సింగ్ విద్యార్థినులు

ఆంధ్ర మహిళా సభలో నర్సింగ్ విద్యార్థినుల ల్యాంప్ లైటింగ్ వేడుకలు

నల్లకుంట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బీఎస్సీ నర్సింగ్ 20వ బ్యాచ్, జనరల్ నర్సింగ్ విద్యార్థుల 33వ బ్యాచ్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యానగర్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆంధ్ర మహిళా సభ ప్రాంగణంలో ల్యాంప్ లైటింగ్ సెరమనీ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్ర మహిళ సభ అధ్యక్షురాలు ఎస్.ఉషారెడ్డి, ఉపాధ్యక్షురాలు జీ.ఎల్.కె.దుర్గ, రిటైర్డ్ ప్రిన్సిపాల్ అన్నసలోమి, గాంధీ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కార్యదర్శి డాక్టర్ రమాదేవి, ప్రిన్సిపాల్ శ్రావ్య స్పందన తదితరులు పాల్గొన్నారు.

25 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

ఎంపీ ఆర్.కృష్ణయ్య


సమావేశంలో అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, తదితరులు

బర్కత్‌పుర, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీ నివేదిక ఆధారంగా 25 వేల ఉపాధ్యాయ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు 11 వేల పోస్టులకు మెగా డీఎస్సీ ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. శుక్రవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్రంలో 25 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రభుత్వానికి విన్నవించాయని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు లేకుండా పాఠశాలలు ఏ విధంగా నడుపుతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎంతమంది పదవీ విరమణ పొందారు.. ఎంతమంది పదోన్నతులు పొందారు.. ఎన్ని ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేయాలని, లేకుంటే నిరుద్యోగులతో ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు సుధాకర్, రామకృష్ణ, రాజ్‌కుమార్, నందగోపాల్, ప్రభుగౌడ్, కృష్ణయాదవ్, జి.అనంతయ్య పాల్గొన్నారు.

డాక్టర్ల మారథాన్

● కిడ్నీ ఆరోగ్యంపై అవగాహన

ఉప్పల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవాన్ని బంజారాహిల్స్ టిక్స్ హాస్పిటల్‌లో ఘనంగా నిర్వహించారు. కిడ్నీ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు ఆసుపత్రి వైద్యులు మారథాన్ ఈవెంట్‌ను నిర్వహించారు. గురువారం ఉదయం బంజారాహిల్స్‌లోని టీఎక్స్ హాస్పిటల్ నుంచి కేబీఆర్ పార్కు వరకు ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది, స్థానికులతో కలిసి మారథాన్ చేపట్టారు. కేబీఆర్ పార్కు వద్ద వాకర్స్‌కు కిడ్నీ వ్యాధుల భారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయాలను టీఎక్స్ హాస్పిటల్ వైద్యులు వివరించారు. అంతకు ముందురోజు ఆసుపత్రిలో కిడ్నీలపై జరిగిన అవగాహన సదస్సులో నటి శ్రీయ పాల్గొని వైద్యులతో కలిసి తన అనుభవాను పంచుకున్నారు.

కార్యక్రమంలో టీఎక్స్ హాస్పిటల్ డైరెక్టర్లు కీర్తికర్‌రెడ్డి, డాక్టర్ దీపక్‌రాజు, రవీంద్రరెడ్డి, హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీకాంత్ ఓద్నాల, వైద్యులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ శశిధర్, డాక్టర్ హరిప్రసాద్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు డాక్టర్ జయరాంరెడ్డి, డాక్టర్ హిదాయతుల్లాలతో పాటు డాక్టర్ భరత్‌రెడ్డి, డాక్టర్ యశ్వంత్ పాల్గొన్నారు.


గాయనీగాయకులను సత్కరిస్తున్న నిర్వాహకులు

సినారె ప్రతిపాట ప్రత్యేకం

చిక్కడపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సినిమా పాటలు మూడు వేలకుపైగా రాసినా సినారె ప్రతి పాటా సాహిత్యపరంగా ప్రత్యేకత కలిగి ఉంటుందని వంశీ సంస్థల అధినేత డా. వంశీ రామరాజు అన్నారు. సుశీల నారాయణ రెడ్డి ట్రస్ట్, వంశీ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రముఖ కవి డా. సి. నారాయణరెడ్డి తొలి సినీ గీతం రచించి అరవై ఐదు సంవత్సరాలు అయిన సందర్భంగా గాయకులు మిత్రా, వైఎస్ రామకృష్ణ, శశికళ, గీతాంజలిలు నలభై పాటలను మధురంగా ఆలపించి పాటల పట్టాభిషేకం చేశారు. సినారె రచించిన తొలి పాట నన్ను దోచుకుందువటేతో ఆరంభించి ఎవరికీ తలవంచకు, చిత్రం భళారే విచిత్రం వంటి పాటలను వారు గానం చేశారు. తిరుమల గ్రూప్ చైర్మన్ ఎన్. చంద్రశేఖర్ ఈ సందర్భంగా అయోధ్య నుంచి తెప్పించిన శాలువాలతో గాయనీగాయకులను సత్కరించారు. తెన్నేటి సుధ, సుంకరపల్లి శైలజ, సినారె కుమార్తెలు గంగ, యమున, కావేరి, కృష్ణవేణి పాల్గొన్నారు.

స్కాలర్ షిప్ బకాయిలు విడుదల చేయాలి

కవాడిగూడ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): విదేశీ విద్యను అభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని విదేశీ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ ఓవర్సీస్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా అంబేడ్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ రూ. 20 లక్షల నుంచి 40 లక్షలకు పెంచాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నాలో విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సురభి పార్కు అభివృద్ధికి మోక్షం: కార్పొరేటర్

చిక్కడపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నో అడ్డంకుల అనంతరం సురభి పార్కు అభివృద్ధికి మోక్షం లభించిందని గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆమె జీహెచ్‌ఎంసీ హార్టికల్చర్ విభాగం మేనేజర్ భాస్కర్, అసిస్టెంట్ మేనేజర్ గౌతమ్‌లతో కలిసి సురభి పార్కును సందర్శించి అభివృద్ధి పనుల గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు మూడు సంవత్సరాలకు పైగా సురభి పార్కు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పార్కు అభివృద్ధికి మంజూరైన నిధులు సైతం వెనక్కి మళ్లించి అభివృద్ధిని అడ్డుకున్న కొంతమంది అరాచకశక్తుల అడ్డు తొలగించి తాము కార్పొరేటర్‌గా ఎన్నికైన నాటినుంచి డివిజన్ అభివృద్ధికి తీసుకున్న అనేక రకాల చర్యల్లో భాగంగా సురభి పార్కు అభివృద్ధి కావొస్తోందన్నారు. ఈపార్కు అభివృద్ధికి రూ. 5 లక్షలతో బోర్‌వెల్ ఏర్పాటు చేసి మరో రూ. 2 లక్షలతో పార్కు సుందరీకరణ పనులు పూర్తి చేస్తున్నామని వివరించారు.


వేతన సవరణ సంఘం చైర్మన్ శివశంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నేతలు

వేతన సవరణలో నాల్గవ తరగతి ఉద్యోగులకు న్యాయం చేయాలి

బర్కత్‌పుర, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వేతన సవరణలో నాల్గవ తరగతి ఉద్యోగులకు న్యాయం చేయాలని తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర వేతన సవరణ సంఘం చైర్మన్ ఎన్.శివశంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. నాల్గవ తరగతి ఉద్యోగులకు బేసిక్ పే రూ.35 వేలు ఉండేట్లు చూడాలని కోరారు. 51 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని, స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ పెంచాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ధర్మానాయక్, ఖాదర్, హసన్, కె.ధన్‌రాజ్; భరత్ పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్


కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, విక్రమ్‌గౌడ్

కవాడిగూడ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కుల, కుటుంబ పార్టీలకు వ్యతిరేకంగా బహుజన సమాజం కలిసికట్టుగా పోరాటం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మెజార్టీ ప్రజలకు రాజ్యాధికారం దక్కే వరకు పోరాటాన్ని ఆపేది లేదని ఆయన హెచ్చరించారు. శుక్రవారం దోమలగూడ బీసీ భవన్‌లో కాన్షీరాం 90వ జయంతి వేడుకలను బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్‌గౌడ్.. కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బహుజన సిద్ధాంతాలను సమాజానికి అందించిన గొప్ప మేధావి కాన్షీరాం అని, ఆయన ఆశయాలను బహుజన సమాజం ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, మహిళా అధ్యక్షురాలు మణిమంజరి, ఉపాధ్యక్షులు స్వర్ణగౌడ్, కార్యదర్శి సమతాయాదవ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మధు, బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మాదేశి రాజేందర్, బీసీ సంఘాల నేతలు ఇంద్రం రజక, మహేష్ మేరు, భాస్కర్ పాల్గొన్నారు.

అదనపు అంతస్తుకు రూ.1.20 కోట్లు

● డిమాండ్ చేసిన విలేకరి, సెక్షన్ ఆఫీసర్

● పోలీసులను ఆశ్రయించిన నిర్మాణదారుడు.. ఇద్దరి అరెస్టు

బంజారాహిల్స్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అదనపు అంతస్తు నిర్మించుకునేందుకు ఏకంగా రూ.1.20 కోట్లను ఓ విలేకరి, జీహెచ్‌ఎంసీ సెక్షన్ ఆఫీసర్ డిమాండ్ చేశారు. అంత డబ్బు ఇవ్వలేనని అదనపు అంతస్తు నిర్మాణాన్ని కూడా నిర్మాణదారుడు విరమించుకున్నాడు. అయితే, వేధింపులు ఆగలేదు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు.10లో ప్రసాద్ భవన నిర్మాణం చేపట్టాడు. ఆయనకు రెండు అంతస్తుల వరకు నిర్మాణానికి అనుమతి ఉంది. నిబంధనలు అతిక్రమించి మూడో అంతస్తు నిర్మాణం చేపట్టారు. సమాచారం అందుకున్న జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. ఇదిలా ఉండగా,నిర్మాణదారుడి వద్ద నుంచి డబ్బు లాగేందుకు జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారి విశాల్, విలేకరి ఆకుల కిరణ్‌గౌడ్ పథకం వేశారు. ఈ మేరకు విశాల్ కొద్ది రోజుల క్రితం నిర్మాణదారుడు ప్రసాద్ వద్దకు వెళ్లి భవనంపై ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పాడు. ఫిర్యాదుదారుడైన కిరణ్‌గౌడ్‌తో మాట్లాడుకోవాలని సూచించాడు. ప్రసాద్ ఒప్పుకొని కిరణ్‌కు ఫోన్ చేశాడు. ఫిర్యాదు వెనక్కి తీసుకుంటానని చెప్పిన కిరణ్ అదనపు అంతస్తు నిర్మించుకోవాలంటే జీహెచ్‌ఎంసీ, మీడియాకు కలిసి రూ.1.20 కోట్లు ఇవ్వాలని అడిగాడు. దీనికి ప్రసాద్ ఆశ్చర్యపోయాడు. నిర్ణయం తీసుకునేందుకు కొంత సమయం అడిగాడు. అనంతరం అదనపు అంతస్తు నిర్మాణం ఆలోచనను విరమించుకున్నాడు. కిరణ్ వేధింపులు ఆగలేదు. ప్రతీ రోజు ఫోన్ చేసి డబ్బు ఎప్పుడు ఇస్తారు అంటూ వేధించడం మొదలుపెట్టాడు. దీంతో నిర్మాణదారుడు పశ్చిమ మండలం డీసీపీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సూచన మేరకు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కిరణ్ డబ్బు అడిగినట్లు ఆడియో టేపులతోపాటు ఇతర ఆధారాలు అందజేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు కిరణ్‌గౌడ్‌తో పాటు విశాల్‌ను అరెస్టు చేశారు. సెక్షన్ 384, 506, 120బి ఐపీసీ కింద కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కిరణ్‌గౌడ్ గతంలో భవన నిర్మాణదారుల వద్ద డబ్బు డిమాండ్ చేసిన కేసులు అనేకం ఉన్నాయని తేలింది. ఓ నిర్మాణదారుడి వద్ద డబ్బు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. పోలీసుస్టేషన్‌లలో కూడా కిరణ్‌గౌడ్‌పై కేసులు ఉనట్టు పోలీసుల విచారణలో తేలింది.

రూ. 7 కోట్లు కొల్లగొట్టారు..

● రియల్ ఎస్టేట్ ముసుగులో ఘరానా ఆర్థిక మోసం

● ఆకర్షనీయ లాభాలంటూ నమ్మించారు.. ● ఇద్దరి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ ముసుగులో ఘరానా ఆర్థిక మోసాలకు పాల్పడి రూ.7 కోట్లు కొల్లగొట్టిన కేటుగాళ్లను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) అధికారులు అరెస్ట్ చేశారు. ఈవోడబ్ల్యూ డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌కు చెందిన తమ్మినీడి వెంకటప్రసాద్ కొర్రపాటి వెంకటరత్నం, వెంకట చిరంజీవి, విఠల్‌రెడ్డి తదితరులు కలిసి జేజే ఇండియా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో రియల్ ఎస్టేట్ సంస్థను ప్రారంభించారు. దానికి తమ్మిడి వెంకటప్రసాద్ ఎండీగా, వెంకటరత్నం మార్కెటింగ్ ఏజెంటుగా ఉన్నారు. తమ సంస్థలో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలోనే అధిక లాభాలు వస్తాయంటూ నమ్మించారు. మహేశ్వరం, గచ్చిబౌలి, ఆమనగల్, శిల్పారామం తదితర ప్రాంతాల్లో వెంచర్స్, వ్యవసాయ భూములు ఉన్నాయని చూపించారు. సరిగ్గా మూడేళ్లలో ప్రాజెక్టులు పూర్తవుతాయని నమ్మించారు. ముందుగా పెట్టుబడి పెట్టినవారికి వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో రూ.10 వేలకు ఎస్‌ఎఫ్‌టీ చొప్పున కేటాయిస్తామని, ఆ తర్వాత ప్రతి నెల ఒక్క ఎస్‌ఎఫ్‌టీకి రూ. 100ల చొప్పున అద్దె చెల్లిస్తామని అలా 30 నెలల్లోనే పెట్టుబడి డబ్బుకు అధిక మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మించారు. ఆకర్షనీయమైన బ్రోచర్లు, పేపర్ ప్రకటనలు ఇచ్చి కస్టమర్స్‌ను ఆకర్షించారు. వారి మాటలు నమ్మి పెట్టుబడుల రూపంలో ఎనిమిది మంది బాధితులు రూ. 3.56 కోట్లు డబ్బులు చెల్లించారు. డబ్బులు చేతికి అందిన తర్వాత నిందితులు లాభాలు ఇవ్వడం అటుంచి స్పందించడం మానేశారు. దాంతో బాధితులు సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. డీసీపీ కె. ప్రసాద్, ఏసీపీ ఎస్. రవీందర్ పర్యవేక్షణలో ఈవోడబ్ల్యూ పోలీసులు రంగంలోకి దిగి ప్రధాన నిందితులు తమ్మిడి వెంకట ప్రసాద్, కొర్రపాటి వెంకటరత్నంలను అరెస్టు చేశారు. వారిని విచారించిన క్రమంలో సుమారు 15 మంది నుంచి రూ.7 కోట్లు వసూలు చేసినట్లు తేలింది. జేజే ఇన్‌ఫ్రాతో పాటు.. తరిణి అవెన్యూ, ఎల్‌ఎల్‌పీ పేరుతో సంస్థలు ఏర్పాటు చేసి పెట్టుబడుల పేరుతో డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు.

పూడికతీత పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

● కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్‌లో చేపట్టిన పూడికతీత పనుల్లో నిర్లక్ష్యం వహించరాదని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అధికారులను కోరారు. డివిజన్‌లోని పటేల్‌నగర్ నాలాలో పూడికతీత పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. నాలాలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. రాబోయే వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని వర్షం నీరు సాఫీగా వెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఎస్‌ఐబీలో ఏకఛత్రాధిపత్యం

(5వ పేజీ తరువాయి)

కెమెరాలను ఆపివేసి, ఏళ్ల తరబడి హార్డ్ డ్రైవ్స్‌లో ఉన్న డాటాను ధ్వంసం చేసి, వాటి స్థానంలో కొత్త హార్డ్ డ్రైవ్‌లను ఏర్పాటు చేసినట్లు పోలీసులు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. పోలీసులు ప్రణీత్ కుమార్‌పై పలుసెక్షన్లతోపాటు ఐటీ యాక్టులు ప్రయోగించి కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా డీసీఆర్‌బీ వర్టికల్ విభాగానికి బదిలీ అయిన ప్రణీత్‌రావును జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి ఆధ్వర్యంలో పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ బి. శోభన్, ఎస్‌ఐ పి.ప్రదీప్ బృందం ఈనెల 12న రాత్రి 10:30కు అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ప్రణీత్ రావు నుంచి పోలీసులు ఒక లాప్‌టాప్, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులు అప్పటికే సేకరించి పెట్టుకున్న సమాచారంతో ప్రశ్నించగా, ప్రణీత్‌రావు నేరాన్ని అంగీకరించాడు. అనంతరం ఆస్పత్రికి తరలించి కొవిడ్‌తోపాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరిచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. ప్రణీత్‌రావు కేసు విచారణ అధికారిగా జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరికి అప్పగించారు.

కాగా.. ఆయన టీమ్‌లో ఇన్‌స్పెక్టర్లు శోభన్, వెంకటేశ్వర్‌రెడ్డి, కె.ఎం రాఘవేంద్ర, శ్రీనివాసులు ఉన్నట్లు వెల్లడించారు.


నల్లకుంట భాగ్యనగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ అమృత

కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని బస్తీలు, కాలనీలల్లో సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటిని పరిష్కరించడం ద్వారా ప్రజల ఇక్కట్లను తొలగించేందుకు కృషి చేస్తున్నామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం నల్లకుంట డివిజన్ భాగ్యనగర్‌లో రూ.10 లక్షలతో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ వై.అమృతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో నిరంతరం పాదయాత్ర చేస్తూ సమస్యలను గుర్తించి అధికారులతో వెంటనే వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. నల్లకుంట కార్పొరేటర్ అమృత మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని బస్తీలు, కాలనీలలో మంచినీరు, డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థను ఆధునీకీకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జలమండలి డీఈ ప్రవీణ్‌కుమార్, రోహిత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, నల్లకుంట డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు కె.మురళీయాదవ్, నందు, అనిత, జి.శంకర్, కె.జి.బాబు, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

వాతావరణ మార్పులపై పాత్రికేయులకు శిక్షణా తరగతులు

● మీడియా అకాడమి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

బర్కత్‌పుర, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులపై రాష్ట్రవ్యాప్తంగా పాత్రికేయులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వచ్చే శిక్షణా తరగతుల్లో ఈ అంశాన్ని చేర్చనున్నట్లు తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యూజే, వ్యూస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో యూఎస్‌ఏ కన్సోలెంట్ జనరల్ సహకారంతో నిర్వహించిన జర్నలిస్టుల రెండు రోజుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో కె.శ్రీనివాస్‌రెడ్డి ప్రసంగించారు. వాతావరణ మార్పులు, పర్యావరణం ఆవశ్యకతపై పాత్రికేయులకు సంపూర్ణ అవగాహన కల్పిస్తామన్నారు. యూఎస్‌ఏ కన్సోలెంట్ జనరల్ ప్రజా వ్యవహారాల అధికారి అలెగ్జాండర్ మెక్ లార్సన్ మాట్లాడుతూ వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు పాత్రికేయులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా వాతావరణ మార్పులపై కథనాలు రాసిన పాత్రికేయులకు ఉత్తమ పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి కె.విరాహత్‌అలీ, వ్యూస్ సంస్థ ఈడీ భీమారావు, సీనియర్ పాత్రికేయులు సుధాకర్‌రెడ్డి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

దీపక్‌కుమార్‌ను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు


బోర్లకుంట దీపక్‌కుమార్‌ను హౌస్ అరెస్టు చేసిన అంబర్‌పేట పోలీసులు

గోల్నాక, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పలు కులాల వారికి ప్రత్యేక కార్పొరేషన్లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్ణయం తీసుకోవడంతో నేతకాని మహర్ సంక్షేమ సంఘం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం శుక్రవారం చలో సెక్రటరియట్ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చింది. అందులో భాగంగానే గోల్నాక డివిజన్ తిరమలనగర్‌లో నివాసం ఉంటున్న నేతకాని మహర్ సంక్షేమ సంఘం జాతీయ నాయకులు బోర్లకుంట దీపక్‌కుమార్ నివాసానికి అంబర్‌పేట పోలీసులు చేరుకుని ఆయనను హౌస్ అరెస్టు చేశారు. పోలీసులు అనంతరం దీపక్‌కుమార్ అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని అపలేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా కుల హక్కుల కోసం పోరాటం చేసి బంధించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. నేతలను అరెస్టు చేసి తమ హక్కులకు భంగం కలిగిస్తున్న తీరుపై ఆయన మండిపడ్డారు. నేతకానీల ఐక్యతతో ప్రత్యేక కార్పొరేషన్ సాధించే వరకు ఉద్యమం చేస్తామన్నారు.

శంషాబాద్ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కన్హా శాంతివనం సందర్శనకు నేడు భారత ఉప రాష్ట్రపతి రానున్నారు. ఈ సందర్భంగా శంషాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందిగామ పరిసరాల్లో నేడు, రేపు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయి. హైదరాబాద్ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను గొల్లపల్లి టోల్‌గేట్ వయా పెద్దగోల్కొండ మీదుగా ఇండియన్ బేకరీ(తొండుపల్లి), బుర్జుగడ్డ వద్ద యూటర్న్ తీసుకొని ముచ్చింతల్, మన్‌సాన్‌పల్లి ఎక్స్‌రోడ్డు, అమీర్‌పేట్, తిమ్మాపూర్, షాద్‌నగర్ మీదుగా మళ్లిస్తారు. అలాగే, గచ్చిబౌలి నుంచి వచ్చే ట్రాఫిక్‌ను పెద్దగోల్కొండ టోల్‌గేట్, మన్‌సాన్‌పల్లి ఎక్స్‌రోడ్డు, అమీర్‌పేట్, తిమ్మాపూర్, షాద్‌నగర్ మీదుగా మళ్లిస్తారు. షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో షాద్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ట్రాఫిక్‌తోపాటు పెంజర్ల ఎక్స్‌రోడ్డు నుంచి వచ్చే ట్రాఫిక్‌ను అమీర్‌పేట్ మన్‌సాన్‌పల్లి ఎక్స్‌రోడ్డు నుంచి పెద్దగోల్కొండ టోల్‌గేట్, శంషాబాద్, హైదరాబాద్ వైపు మళ్లిస్తారు. ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పైన తెలిపిన ప్రాంతాల్లోనే ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని జాయింట్ సీపీ పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గమ్యస్థానాలకు చేరుకోవాలని, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని ఆయన సూచించారు.